క్లుప్తంగా

మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు సత్కారం



భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను ఆ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ గుర్రం గౌతమ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సిటీ బూత్ ప్రెసిడెంట్ సీరపు గణేష్ రెడ్డి, 30వ వార్డు ఇన్‌చార్జి కాటం రజనీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోదావరికి పున్నమి హారతి



గోదావరి మాతకు పున్నమి హారతి ఇస్తున్న భక్తులు

ధవళేశ్వరం: గ్రామంలోని రామపాదాలరేవులో సోమవారం రాత్రి గోదావరి మాతకు పున్నమి హారతి ఇచ్చారు. సూరపురెడ్డి శ్రీరామ్, అనంతలక్ష్మి ఈ కార్యక్రమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, గోదావరి మాతకు పూజలు నిర్వహించారు.

స్వచ్ఛ పాఠశాల అవార్డు ప్రదానం



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర 2025లో భాగంగా స్వచ్ఛ పాఠశాల జిల్లా స్థాయి అవార్డును శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నున్న ప్రశాంతి సోమవారం కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా అందుకున్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. అవార్డు అందుకున్న హెచ్‌ఎం ప్రశాంతిని స్టాఫ్ సెక్రటరీ డి.రాముడు, మహిళా ప్రతినిధి ఉమారాణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

శాస్త్రవేత్త వెంకటేష్‌కు ఆర్‌ఎల్ ఠాకూర్ అవార్డు



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి వెంకటేష్ ప్రతిష్టాత్మక డాక్టర్ ఆర్ ఎల్ ఠాకూర్ అవార్డును అందుకోనున్నారు. నగరంలోని ఆల్కాట్ తోటకు చెందిన పిల్లి సత్యనారాయణ కుమారుడైన వెంకటేష్ కోల్‌కతాలోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. సిరామిక్ విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనను, జంషెడ్‌పూర్‌లోని టాటా స్టీల్ సంస్థలో ప్రిన్సిపల్ రీసెర్చర్‌గా పని చేస్తున్న అనుశ్రీ నాగ్‌లను సంయుక్తంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు ఇండియన్ సిరామిక్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ జితేందు మండల్ తెలిపారు. ముంబాయి ఐఐటీలో నవంబర్ 27న జరిగే ఇండియన్ సిరామిక్ సొసైటీ 89వ వార్షిక సదస్సు ప్రారంభ వేడుకల్లో డాక్టర్ వెంకటేష్ అవార్డును అందుకుంటారు.

తేజస్ స్టీల్ ఇండస్ట్రీకి స్వచ్ఛాంధ్ర అవార్డు



అవార్డు అందుకుంటున్న మాధవీలత

సీటీఆర్ఐ: నగరానికి చెందిన తేజస్ స్టీల్ ఇండస్ట్రీస్ అధినేత మండవిల్లి మాధవీలత జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఇండస్ట్రీస్ అవార్డు అందుకున్నారు. రాజమండ్రి రూరల్‌లోని స్టీల్ కిచెన్ సింక్స్ తయారీదారులైన మెస్సర్స్ తేజస్ స్టీల్ ఇండస్ట్రీస్ (ఎంఎస్ఎంఈఎస్) విభాగంలో ఈ అవార్డును సొంత చేసుకుంది. వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా మండవిల్లి మాధవీలత అవార్డు అందుకున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామానికి చెందిన మద్దాల వెంకట అప్పారావుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. ఉదయం మేతకు వెళ్లిన ఈ గేదె సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తిరిగి వస్తుండగా, రాపాక – కోటికేశవరం రోడ్డులో రాపాక శివారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తెగి దానిపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.

నిషేధమా.. నీవెక్కడ!

- యథాతథంగా ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డులకు టన్నుల కొద్దీ వ్యర్థాలు
- ప్రచారానికే పరిమితమైన నిషేధం



కడియపులంక వద్ద హైవే డివైడర్‌పై చెత్తలోకి చేరిన ప్లాస్టిక్ కవర్లు



డంపింగ్‌యార్డులో తగులబడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

కడియం: ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, జీవులకు కలిగే ప్రమాదాలపై నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు సైతం ప్లాస్టిక్ ముప్పును గుర్తించినప్పటికీ క్షేత్రస్థాయిలో నియంత్రణ/నిషేధానికి మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు. రీయూజబుల్ ప్లాస్టిక్ వినియోగంపై చట్ట ప్రకారం అనేక నిషేధాలు ఉన్నాయి. కానీ వీటి వినియోగాన్ని మాత్రం అవేవీ ఆపలేకపోతున్నాయి. ప్రతి గ్రామ శివార్లలోని డంపింగ్ యార్డులకు టన్నుల కొద్దీ చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలే దీనికి నిదర్శనం.

అప్పట్లో హడావుడి

వినియోగిస్తే ఒక ముప్పు, చెత్తలో పడేస్తే మరో ముప్పు, తగల బెడితే మరింత ముప్పు అంటూ ఎప్పటికప్పుడే ప్లాస్టిక్ ద్వారా వచ్చే ప్రమాదాలపై ప్రచారాలు మాత్రం ఏకధాటిగా సాగుతున్నాయి. అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ సీఎంల మధ్య ప్లాస్టిక్ నిషేధం అంశం కూడా ఇటీవలే పాపులర్ అయ్యింది. కానీ నిషేధం మాత్రం అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి, రెండు వారాల పాటు ప్లాస్టిక్ నిషేధం అంటూ చిన్నా చితకా బడ్డీ కొట్లు మొదలుకుని, వ్యాపార సముదాయాల వరకు యంత్రాంగం హడావుడి చేసింది. నోటీసులు కూడా జారీ చేసేసి, ఇక ప్లాస్టిక్ నిషేధించేసినట్టే అన్న రీతిలో వ్యవహరించింది. ఉన్నతాధికారులను ఆదర్శంగా తీసుకున్న గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు అంటూ హంగామా చేసి, ఆ తర్వాత మిన్నకుండిపోయారు.

టన్నులకొద్దీ వ్యర్థాలు

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో యథాతథంగా టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. అక్కడ మంటల్లో కాలి వాతావరణ కాలుష్యానికి, తద్వారా ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. ఈ తతంగమంతా యంత్రాంగం కళ్లెదుటే జరుగుతున్నప్పటికీ ఏమాత్రం చలనం ఉండడం లేదు. అధికారులు వచ్చి అడిగే చూద్దాములే అన్న రీతిలో వ్యాపార/వాణిజ్య సముదాయాలు కూడా తిరిగి ప్లాస్టిక్ వినియోగం బాట పట్టేశాయి. ఎక్కడికక్కడ పాలిథిన్ బ్యాగుల వినియోగం సాధారణ స్థితిలోనే కొనసాగుతోంది.

ఒకటి, రెండ్రోజుల హడావుడి

ప్లాస్టిక్ కవర్లు వినియోగించ వద్దంటూ అప్పట్లో ఒకటి, రెండు రోజుల పాటు హడావుడి చేశారు. ఆ తర్వాత ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు ఒకరిని చూసి మరొకరు తమ వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లను ఇస్తున్నారు.

– కె.కృష్ణ, పువ్వుల కొనుగోలుదారుడు

యథాతథంగా వినియోగం

ప్లాస్టిక్ సంచులను వినియోగించ వద్దంటూ అధికారులు పట్టుబట్టడంతో వ్యాపారులు కాగితం సంచుల్లో వస్తువులు వేసి ఇచ్చేవారు. అయితే రానురాను ప్లాస్టిక్ నిషేధం గురించి పట్టించుకోకపోవడంతో ఎప్పటి మాదిరిగానే ప్లాస్టిక్ కవర్లు వినియోగంలోకి వచ్చేశాయి. పక్కాగా చర్యలు తీసుకుంటేనే నిషేధం సాధ్యమవుతుంది.

– వినయ్ కుమార్, కడియపులంక

ఆదర్శ గురువులకు గురుబ్రహ్మ పురస్కారాలు



గురువును సత్కరిస్తున్న ప్రముఖులు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సీటీఆర్ఐ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఆదర్శ గురువులను గుర్తించి వారికి గురుబ్రహ్మ పురస్కారాలు అందించడం అభినందనీయమని,అలాగే వివిధ రంగాల ద్వారా సమాజ సేవ చేస్తున్న ప్రముఖులకు విశిష్ట సేవా పురస్కారాలు అందించడం ఎంతో సముచితంగా ఉందని వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమండ్రి రౌండప్ సాయంకాల పత్రిక నిర్వాహకుడు జమ్మా రమేష్ రాజా ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శ గురువులకు గురుబ్రహ పురస్కారాలు, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జరిగిన సభకు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అధ్యక్షత వహించగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎల్.నరసింహం, పిడుగు విజయభాస్కర్, అన్నమయ్య జిల్లా విశిష్ట అండ్ చైతన్య స్కూల్స్ కరస్పాండెంట్ డాక్టర్ కె.రెడ్డయ్యరాజులకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. సుమారు 80 మంది ఆదర్శ గురువులకు గురుబ్రహ పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్లు, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు అవార్డు

కంబాలచెరువు: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆదిత్య యానిమేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ గురుబ్రహ్మ అవార్డు పొందారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జరిగిన కార్యక్రమంలో సోమవారం గోదావరి టాలెంట్ ట్ర స్ట్ నిర్వాహకులు అవార్డును ప్రదానం చేశారు. ఆయనను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్లు సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కే రెహమాన్, డి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జీవీఎస్.నాగేశ్వరరావు అభినందించారు.

మేకప్ప చెరువు గట్టుపై చెత్త తొలగింపు



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలోని మేకప్ప చెరువు గట్టుపై వేసిన చెత్త తొలగింపు పనులను సోమవారం చేపట్టారు. ఆ గ్రామంలో సేకరించిన చెత్తను ఇటీవల పంచాయతీ అధికారులు అక్కడ వేయించారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతోందని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, రజకులతో కలిసి చెరువు వద్ద ఆందోళన చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ సోమవారం జేసీబీలను ఏర్పాటు చేసి మేకప్ప చెరువు గట్టుపై వేసిన చెత్తను ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు సిబ్బందితో తీయించి శుభ్రం చేయిస్తున్నారు. ఆ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివకుమార్, కామిరెడ్డి పెదకాపు, బీదం రాజు, తదితరులు పరిశీలించారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



హెచ్‌ఎం పద్మజను సత్కరిస్తున్న తల్లిదండ్రుల కమిటీ

కంబాలచెరువు: పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముంగండి సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ఇంగ్లిష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్‌ఎం వి.పద్మజను అన్నపూర్ణమ్మపేట తల్లిదండ్రుల కమిటీ సన్మానించింది. సూర్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న పిల్లలు, పెద్దవారై స్థిరపడి వాళ్ల పిల్లలను కూడా ఇదే స్కూల్లో చదివించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పైలా రాంబాబు, సెయింట్ జాన్స్ పాఠశాల డైరెక్టర్ జాన్సన్, ఉపాధ్యాయులు నాగరాజు, సీఆర్‌ఎంటీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

హండ్రెడ్ ఫీట్ రోడ్డులో అంధకారం



హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వెలగని వీధి దీపాలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం హండ్రెడ్ ఫీట్ రోడ్డులో రెండు రోజులుగా వీధి దీపాలు వెలగక పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంత ప్రజలు నగరంలోకి ఎస్వీ జనరల్ మార్కెట్, వాంబే గృహాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగక పోవడంతో వాహన చోదకులతో పాటు, ఈ రోడ్డులో నడిచే వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన నగరపాలకసంస్థ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తీవ్రంగా గాయపడిన విజయ్ కృష్ణ

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.వి జయ్‌కృష్ణ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆవ వాంబేకాలనీకి చెందిన విజయ్ కృష్ణ ద్విచక్ర వాహనంపై రైల్వే స్టేషన్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వైపు వస్తున్నాడు. అయితే పక్క రోడ్డులోకి తిరిగే ప్రయత్నంలో ఆర్టీసీ బస్సు చక్రాల కిందకు వెళ్లిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 పైలట్ గణేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆ యువకుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో దీక్షారంభం కార్యక్రమం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. దీనికి జోన్ 1, 2 ఆర్జేడీ డాక్టర్ పీవీ కృష్ణాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి, విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, గొప్ప విద్యావేత్తలు ఆర్ట్స్ కళాశాలలో విద్యను అభ్యసించారన్నారు. కళాశాలలోని స్టార్టప్‌లు, ల్యాబ్‌లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సర్వీసులు, జేకేసీ ఉద్యోగ అవకాశాలను వివరించారు.

పాముకాటు మందు లేకే వీరబాబు మృతి

- అన్ని పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలి
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజా



మృతుడి సోదరుడికి ధైర్యం చెబుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: పాముకాటు మందు అందుబాటులో లేకపోవడం వల్లే గాదరాడకు చెందిన పి.వీరబాబు మృత్యువాత పడ్డాడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో ఆ వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గాదరాడ గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో బాధితులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని పీహెచ్‌సీలో స్నేక్ బైట్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచి పాము కాటు మరణాలు తగ్గించామన్నారు. వ్యవసాయ సీజన్ పనులు ముమ్మరం కావడంతో పొలం గట్లపై విష సర్పాలు సంచరిస్తాయన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలనే నిబంధనలను ఉల్లంఘించారని, దానిలోని భాగంగానే సెప్టెంబరు 30న పాము కాటుకు గురైన వీరబాబుకు సక్రమమైన వైద్యం అందక మృతి చెందాడన్నారు. ఆందోళనలో మృతుడు సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోరాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



కోరుకొండలో నినాదాలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

కోరుకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరిట ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం సరికాదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల వరదరాజ సాంచి అన్నారు. ఆయన కోరుకొండలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి కె.కృష్ణ మోహన్, జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం, నియోజకవర్గం ఇన్‌చార్జి ఎన్.బాలాజీ పాల్గొన్నారు.

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

సీతానగరం: నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు ఉద్యానవన శాఖ అధికారి రీని సూచించారు. ఆమె సోమవారం మిర్తిపాడు, ఉండేశ్వరపురాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నత్తలు ఆశించిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇవి మామూలుగా తోటల్లో కనిపించేవి కావని, ఆఫ్రికా నుంచి వలస వచ్చిన జాతి అన్నారు. ఒక్కొక్క నత్త వెయ్యి నుంచి 12 వందల గుడ్లు పెడుతుందన్నారు. కిలో ఉప్పును ఐదు లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో నత్తలను వేస్తే సమగ్రంగా నివారించవచ్చన్నారు. వాటి ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటిలో మూడు గ్రాముల చిలెటెడ్ కాపర్, మూడు గ్రాములు చిలెటెడ్ ఐరన్ కలిపి చెట్ల మీద పిచికారీ చేస్తే రాలిపోయి, చనిపోతాయన్నారు. ఒక తోట నుంచి మరో తోటకు వ్యాప్తి చెందకుండా సరిహద్దుల్లో అక్కడక్కడ ఉప్పు నీరు చల్లిన గోనే పట్టాలను పరచాలని సూచించారు. ఎరీస్ కంపెనీ సిబ్బందితో కలిసి రైతుల తోటల్లో కెమికల్‌ను ప్రయోగాత్మకంగా చేయించారు.

పేకాట శిబిరంపై దాడి

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో మార్గాని వెంకటేశ్వరరావుకు చెందిన ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్న 12 మందిని సోమవారం అరెస్టు చేశామని ఎస్సై పి.నారాయణమ్మ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నిందితుల నుంచి రూ.19,840, తొమ్మిది మోటారు సైకిళ్లు, తొమ్మిది సెల్ ఫోన్లు, ఒక ప్లాస్టిక్ టేబుల్, 10 కుర్చీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అర్జీదారుల్లో నమ్మకం పెంచాలి



అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీపై క్రియాత్మకంగా స్పందించి, అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలని డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి 17 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోపు అర్జీలను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి ఖండన



సమావేశంలో పాల్గొన్న విజయ్ కుమార్ తదితరులు

సీటీఆర్ఐ: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) బీఆర్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాయవాది, ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేసు విచారణ జరుగుతుండగా లాయర్ కిశోర్ రాకేష్.. సీజేఐకి అతి దగ్గరగా వెళ్లి తన బూటు తీసి ఆయనపై విసిరేందుకు ప్రయత్నం చేశారన్నారు. దాన్ని తోటి లాయర్లు, సిబ్బంది అడ్డుకున్నారు. ఇది న్యాయమూర్తిపై దాడి కాదని దేశ ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తున్నామన్నారు. రాజ్యాంగ విలువలు మన దేశంలో ఉండడం లేదని, మతం అనే ముసుగులో మనుషులు మతి తప్పి ప్రవర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు కడిమి జీవన్, కాకర జేమ్స్, పిండి అశోక్, కోటిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



భానుప్రసాద్‌ను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పందెళ్ల భానుప్రసాద్‌ను రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ మాజీ చైర్మన్ , వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్ సోమవారం ధవళేశ్వరంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాగేశ్వర్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఒంటెద్దు కృష్ణ, గునిపే అశోక్, పేర్ల భాస్కర్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, గూటం రాజు, దాసరి ధర్మ, డేవిడ్ బూన్, అండిబోయిన బాలాజీ తదితరులు ఉన్నారు.

అదుపు తప్పి.. డివైడర్ పైకెక్కి..



బొమ్మూరు వద్ద జాతీయ రహదారి డివైడర్ పైకి ఎక్కేసిన వాహనం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి బొమ్మూరు వద్ద డివైడర్ పైకి సోమవారం మధ్యాహ్నం ఓ జీపు దూసుకుపోయింది. వేమగిరి వైపు నుంచి బొమ్మూరు వైపు వస్తున్న ఆ వాహనం సుద్దగని వద్దకు వచ్చేసరికి అతి వేగం కారణంగా అదుపు తప్పింది. డివైడర్‌పై బలమైన ఇనుప తీగలు కట్టి ఉండడంతో అక్కడికక్కడే నిలిచిపోయింది. లేకపోతే ఇవతల రోడ్డులోకి వచ్చిఉంటే ప్రమాదం భారీగా జరిగేది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. జీపు అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.

వలస కార్మికుడి మృతి

ధర్మవరం అర్బన్: స్థానిక మారుతీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు పైనుంచి జారి పడి వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్య గ్రామానికి చెందిన గెద్దం రాజ్‌కుమార్ (39) 15 రోజుల క్రితం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేసేందుకు ధర్మవరం వచ్చాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ట్యాంక్‌పై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజ్‌కుమార్ తమ్ముడు గెద్దం ప్రసాద్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు.